క్లుప్తంగా

పాఠశాలలకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

కెరమెరి: మండలంలోని స్థానిక సంస్థల ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం నోటు పుస్తకాలను మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ పంపిణీ చేశారు. మొత్తం 56 పాఠశాలలు ఉండగా 40 పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బుధవారం ఎంఆర్‌సీకి వచ్చి తీసుకెళ్లాలని ఆదేశించారు. నోటుపుస్తకాలను పాఠశాలలోని విద్యార్థులకు తరగతుల వారీగా పంపిణీ చేయాలన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం మండలంలోని సుర్దాపూర్ గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అన్ని రికార్డులను సరైన విధంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూడాలని, ఎక్కడ కూడా మురికి నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మురికి నాలాలు శుభ్రం చేయాలని సూచించారు. మురికి నాలాల్లో లార్వా వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి తరుణ్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న అశోక్ మహోల్కర్

వాంకిడి: వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామం, ఖమ్మం జిల్లా వైరా మండలం సిరిపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని భారతీయ బౌద్ధమహాసభ, అంబేడ్కర్ సంఘం, సిద్దార్థ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, నాయకులు దుర్గం దుర్గాజీ, విజయ్ ఉప్రె, రోషన్, మనోజ్, రాకేశ్, మారుతి, శివాజీ, మోను, నూతన్, స్వాగత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి 'పీఎం జుగా'



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: గిరిజన గ్రామాల అభివృద్ధి కోసమే పీఎం జుగా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెలిగి గ్రామంలో పీఎం జుగా పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గిరి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ, మొబైల్, ఇంటర్‌నెట్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జీపీ ప్రత్యేకాధికారి శైలేందర్, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నారాయణ మూర్తి, ఎస్ఆర్‌పీ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నితీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విష కీటకం కుట్టి విద్యార్థినికి అస్వస్థత

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న జ్యోతిర్మయి అనే విద్యార్థిని సోమవారం రాత్రి విష కీటకం కుట్టడంతో అస్వస్థతకు గురైంది. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ పార్వతి స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం విద్యార్థినిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో..!



కెరమెరి ఘాట్‌పై సింగిల్ రోడ్డు

- ఇరుకుదారితో తప్పని ఇబ్బందులు
- తరుచూ ప్రమాదాలు
- అక్రమంగా పెద్ద వాహనాల రాకపోకలు
- కలగానే రెండు వరుసల రహదారి?



మూలమలుపు వద్ద భారీ వాహనం

కెరమెరి: ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కెరమెరి ఘాట్‌లో విస్తరణ పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలోని కెస్లాగూడ గ్రామం నుంచి మొత్తం 9 కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు విస్తరించి ఉంది. ఈ రోడ్డుపై 37 మూలమలుపులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఘాట్ రోడ్డు చిన్నగా, సింగిల్ రోడ్డు కావడంతో తరచూ వాహనాలు బోల్తా పడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ఆదిలాబాద్‌కు వెళ్లే మార్గం..

ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే ఈమార్గం ద్వారానే వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఈ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. 50 ఏళ్ల క్రితం ఎంత విస్తరణలో రోడ్డు ఉందో ప్రస్తుతం కూడా అలానే ఉంది. ఆ ప్రాంతం పూర్తిగా రిజర్వు ఫారెస్ట్ కావడంతో అటవీ అధికారులు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు. ఇప్పటికీ ఐదేళ్లలో రెండు సార్లు మరమ్మతులు చేపట్టినప్పటికీ రోడ్డు విస్తరణ మాత్రం చేపట్టలేదు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

పెద్ద వాహనాలతో ఇబ్బంది..

ఈ రోడ్డుపై పది టైర్ల వాహనాలతో పాటు భారీ బరువుగల వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదు. కానీ ఈమార్గం గుండా ఆదిలాబాద్‌కు వెళ్తే టోల్ లేకపోవడంతో బరువుగల పెద్ద వాహనాలు అక్రమంగా ఈమార్గం గుండా వెళ్తున్నాయి. అయినా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మూలమలుపుల వద్ద అనేక భారీ వాహనాలు బోల్తా కొట్టి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిన సంఘటనలు ఉన్నాయి. కాగా రోడ్డుకు ఇరువైపులా కాస్తంత మట్టి వేయడంతో వానలు పడినప్పుడల్లా బురదగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి. ఒక వాహనం వెళ్తున్నప్పుడు ఎదురుగా మరో వాహనం వస్తే సైడ్ ఇవ్వడానికి డ్రైవర్లు నానా తిప్పలు పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో డివైడర్లు కూడా లేకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది.

అధికారులు స్పందించాలి



సింగిల్ రోడ్డు కావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఘాట్ రోడ్డుపై డబుల్ రోడ్డు వేయాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ రిజర్వు ఫారెస్టులో రోడ్డు ఉన్నందున అనుమతులు లభించడం లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

– పెందోర్ మోతిరాం, మాజీ ఎంపీపీ, కెరమెరి

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిచే పథకాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. పాత గోడలు, కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామన్నారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, డీటీ సంతోష్‌కుమార్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, మాజీ జెడ్పీటీసీ దుర్పతబాయి, మాజీ వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, బీఆర్‌ఎస్ నాయకులు యూనూస్, పెందోర్ ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌కు చెందిన లెందుగూరే మౌనికకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య పాల్గొన్నారు.

బదిలీపై వచ్చిన అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పర్సనల్ విభాగం హెచ్‌వోడీగా బదిలీపై వచ్చిన రాజేశ్వర్ రావును మంగళవారం బెల్లంపల్లి ఏరియా ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించారు. ఏరియాలోని కార్మికుల సంక్షేమం, వారు హక్కులు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ అండగా ఉంటుందని తెలిపారు. గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషశయన రావు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, రాజయ్య, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకులు..

బెల్లంపల్లి ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్ రావును మంగళవారం ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

చింతలమానెపల్లి: తాజాగా కురుస్తున్న వర్షాలు ప్రజలకు ఊరటనిచ్చాయి. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలతో చెరువులు, వాగుల్లో నీరు చేరుతుండగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఖర్జెల్లి నుంచి గూడెం మార్గంలో వర్షంతో బురదగా మారగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. గూడెం నుంచి అహేరి, ఆళ్లపల్లి మీదుగా సిర్వంచ వెళ్లే రహదారిపై ఆళ్లపల్లి సమీపంలో పనులు నిర్వహిస్తుండగా వాగుపై వంతెన వద్ద తాత్కాలిక రహదారి తెగిపోవడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది.

'కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం'



భూమిపూజ చేస్తున్న సిద్దల దేవయ్య, అధికారులు

కౌటాల: కాంగ్రెస్‌తోనే పేదింటి ప్రజల సొంతింటి కల సాకారమవుతుందని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించాలని, ప్రభుత్వం వెంటనే బిల్లులు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రమేశ్, ఏఈ బద్రుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రోజ్‌మేరి, అంజలి, నాయకులు సత్యనారాయణ, దామోదర్, వినోద్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ గోలేటి స్పోర్ట్స్ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

రెబ్బెన: లయన్స్ క్లబ్ గోలేటి స్పోర్ట్స్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా అన్నం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మారిన చందర్, కోశాధికారిగా ఉప్పులేటి శంకర్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నికల ఇన్‌స్టాలేషన్ అధికారిగా మాజీ జిల్లా గవర్నర్ రిక్కల నారాయణరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ గోలేటి పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సేవలను విస్తరింపజేస్తామని, పేదలకు సేవ చేయడమే క్లబ్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ దేవులపల్లి రాజయ్య, జోన్ చైర్‌పర్సన్ బాపురెడ్డి, మహేందర్‌రెడ్డి, కో చైర్‌పర్సన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన వరద ముంపు కాలనీవాసులు



రాస్తారోకో చేస్తున్న బంబార గ్రామస్తులు

వాంకిడి: మూడేళ్లుగా వరద నీటితో ఇబ్బందులు పడుతున్న బంబార గ్రామంలోని ఎస్సీకాలనీ ప్రజలు మంగళవారం సమస్య పరిష్కరించాలని రోడ్డెక్కారు. ఎన్‌హెచ్ 363పై బైఠాయించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వారం రోజులుగా వరద నీరు ఇళ్లలోనే ఉందని, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. శాశ్వత పరిష్కారం చూపే వరకు కదిలేది లేదని ధర్నా చేశారు. జీపీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ డి.కవిత, ఎస్సై ప్రశాంత్‌లు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యపై గ్రామస్తులతో చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి మహేశ్ వరద నీటిని తొలగించేలా తాత్కాలిక చర్యలు చేపట్టారు.

హిందువులంతా ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న ముదుపు యాదిరెడ్డి

కాగజ్‌నగర్‌టౌన్: హిందువులంతా ఐక్యంగా ఉండాలని తెలంగాణ ప్రాంత హిందూవాహిని సంఘటన మంత్రి ముదుపు యాదిరెడ్డి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ జాగరణ హిందూ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో మాట్లాడారు. హిందువులపై దాడులు పెరుగుతున్నాయని, ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. తెలంగాణలో నడిచేది ప్రజా ప్రభుత్వం కాదని, రజాకార్ల ప్రభుత్వమని మండిపడ్డారు. గోసేవా క్షేత్ర ప్రముఖ్ రామారావు మాట్లాడుతూ గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రొత్సహించడంతోపాటు గో సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హిందూ దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కరీంనగర్ విభాగ్ సహకార్య వాహ్ రంగస్వామి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రైతుభరోసా సంబురాలు



జిల్లాకేంద్రంలో సంబురాల్లో పాల్గొన్న ఆత్రం సక్కు

ఆసిఫాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతు రాజ్యం వచ్చిందని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద మంగళవారం నిర్వహించిన రైతు విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాలేశ్వర్ గౌడ్, గాదెవేణి మల్లేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వం వానాకాలం సీజన్ కోసం రైతుభరోసా పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన నేపథ్యంలో ఎల్కపల్లి రైతు వేదికలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తుందన్నారు. అంతకు ముందు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సముద్రాల రాజన్న, అతహాబేగ్, శంకర్‌గౌడ్, ఇలియాస్, సదాశివ్, నందు, రాంచందర్ పాల్గొన్నారు.

కెరమెరి: రైతు విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో రైతుభరోసా నిధులను విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. నాయకులు ఉనీర్ అహ్మద్, సుదర్శన్, ఆత్రం లక్ష్మణ్, బాబునాయక్, ఆత్రం లింబారావు, నగేశ్, జలపతిరావు, తిరుపతి, విశ్వనాథ్, పాలక్‌రావు, కుత్‌బోద్దిన్, మారుతి తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుస శంకర్, మార్కెట్ కమిటీ సభ్యులు ఆత్రం రాజారాం, నాయకులు సుంకరి విష్ణుమూర్తి, హనుమంతు, మోర్ల గంగన్న, కొట్రంగి శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: రాష్ట్రంలోని రైతాంగ సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రైతు వేదికల్లో రైతుభరోసా సంబరాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని రైతులకు వినిపించారు. మహిళా రైతులకు స్వీట్లు తినిపించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు సోమశేఖర్, రవీందర్, హరీశ్, చిరంజీవిగౌడ్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి, జంబుగ రైతు వేదికల్లో రైతుభరోసా సంబరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతుభరోసా పథకం కింద రైతులకు డబ్బులను జమ చేశామని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు, రైతులు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. వ్యవసాయాధికారి రామకృష్ణ, సహకార పరపతి సంఘం చైర్మన్ సమ్మెట ఉమామహేశ్వర్‌రావు, ఏఈవో సృజన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలోని కంచన్‌పల్లి, లింగాపూర్ క్లస్టర్లలోని రైతు వేదికలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు విన్నారు. ఏవో సంజయ్‌కుమార్, ఏఈవో అమూల్య గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేపట్టారు. మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, పెందూర్ ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్‌లో..



కెరమెరి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బెజ్జూర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



మిషన్ భగీరథ నీటిని బిందెల్లో పట్టుకుంటున్న గిరిజనులు



నీటి ట్యాంకర్ వద్ద జనం

బాబేఝరికి నీరచ్చిందోచ్..!

కెరమెరి: గడిచిన నెల రోజులుగా మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్న బాబేఝరి వాసులకు ఎట్టకేలకు అధికారులు మిషన్ భగీరథ నీరందించారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామస్తుల ఆందోళనల నేపథ్యంలో అధికారులు స్పందించి నీటిని సరఫరా చేశారు. కాగా గ్రామ పంచాయతీ అధికారులు సైతం ఉదయం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

హామీలు అమలు చేయాలి

రెబ్బెన: సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ఏఐటీయూసీ వెంటనే అమలు చేయించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏరియా వర్క్‌షాప్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2023 డిసెంబర్‌లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ ఇచ్చిన హామీలు 18 నెలలు గడిచినా అమలు చేయించలేదని తెలిపారు. టీబీజీకేఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ఎనలేని హక్కులు సాధించామని గుర్తు చేశారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రటరీ సత్తయ్య, ఏరియా కార్యదర్శి వెంకటేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షురాలికి సన్మానం

ఆసిఫాబాద్: మున్నూరు కాపు జిల్లా సంఘం అధ్యక్షురాలిగా ఇటీవల ఎన్నికైన రెబ్బెన మండలం పులికుంటకు చెందిన కుందారపు శంకరమ్మను ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శాలువాతో సన్మానించారు. మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్సపోచయ్య, మాజీ సర్పంచ్ మర్సోకోల సరస్వతి, నాయకులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



నోటీస్ అందిస్తున్న పంచాయతీ కార్మికులు

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్‌కోడ్‌ల అమలు రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. సమావేశంలో నాయకులు మోరేశ్వర్, నగేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.